పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించాలి

- ఇంధన ధరల పెంపుతో ప్రజల జీవితాలు అతలాకుతలం
- భూటాన్, పాకిస్థాన్, శ్రీలంకలో కంటే ఎక్కువ రేట్లు
- విపణిలో క్రూడ్ ధరలు తగ్గినా దేశంలో పెంచుతున్నరు
- ఇదేనా కేంద్రంలోని మోదీ సర్కారు చెప్పిన అచ్ఛేదిన్
- కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్‌కి కేటీఆర్ లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): పెట్రో రేట్లను సెస్సుల రూపంలో పెంచుతూ కేంద్రంలోని మోదీ సర్కారు ఆర్థిక దోపిడీకి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను కబళిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. సెస్సుల ఆదాయాన్ని మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించకుండా, తమ సొంత రాజకీయ ఎజెండా ప్రచారం కోసం వినియోగిస్తున్నారని మండిపడ్డారు. పన్నుల్లో రావాల్సిన న్యాయమైన వాటాను రాష్ట్రాలకు కేటాయించకుండా దేశ సమాఖ్య వ్యవస్థను దెబ్బతీసే కుట్రలకు కేంద్రం పాల్పడుతున్నదని ధ్వజమెత్తారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి సహకరిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతుంటే, అక్రమంగా వసూలు చేస్తున్న సెస్సుల ద్వారా సమకూరుతున్న ఆదాయంతో రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చెలాయిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆకాశాన్నంటుతున్న పెట్రో ధరలపై పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్‌పురీకి కేటీఆర్ బుధవారం బహిరంగ లేఖ రాశారు. ఇంధన ధరల్లో ప్రపంచంలోనే ఖరీదైన దేశాల్లో ఒకటిగా మన దేశం నిలిచిందని విమర్శించారు. భూటాన్, పాకిస్థాన్, శ్రీలంకలో పెట్రో ధరలు భారత్‌లో కంటే తక్కువగా ఉన్నాయని గుర్తుచేశారు.

మోయలేని భారంగా సిలిండర్ ధర

వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.1,100 దాటడం ఆడపడుచులకు భారంగా మారిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఉజ్వల యోజన ఒక క్రూరమైన జోక్ అని విమర్శించారు. ఒకప్పుడు ఉజ్వల్ యోజన కింద సిలిండర్లు తీసుకున్న మహిళలు.. పెరిగిన గ్యాస్ ధరలతో మళ్లీ కట్టెల పొయ్యిపైనే వంట చేస్తున్నారని తెలిపారు. గతంలో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు 100 డాలర్లు దాటినప్పుడూ.. దేశంలో ఇప్పటితో పోలిస్తే ఇంధన ధరలు తక్కువగా ఉన్నాయని, ఇప్పుడు క్రూడ్ ధరలు తగ్గినప్పటికీ ప్రజలపై భారం పెంచడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. బీజేపీ నేతలు గతంలో పెట్రో ధరలు తగ్గించాలని ఆందోళన చేసిన విషయాన్ని లేఖలో ప్రస్తావించారు.

మోదీ చెప్పిన 'అచ్ఛేదిన్' ఇదేనా?

పెట్రోల్, గ్యాస్ ధరల పెంపుతో పేదల జేబులు ఖాళీ అవుతుండగా, ఆయిల్ కంపెనీల గల్లా పెట్టెల్లోకి రూ.వేల కోట్లు చేరుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ధరలు స్థిరంగా ఉంచి, ఓట్ల పండుగ అయిపోగానే పెంచడం ప్రజలను వంచించడమేనని దుయ్యబట్టారు. మినిమం గవర్నమెంట్, మాక్సిమం గవర్నెన్స్ అనే కేంద్ర ప్రభుత్వ నినాదం 'మాక్సిమం ట్యాక్సేషన్.. మినిమం రిలీఫ్'గా మారిందని విమర్శించారు. ప్రధాని చెప్పిన 'అచ్ఛేదిన్' అంటే ఈఎంఐలు కట్టలేని విధంగా, ఇంధన బిల్లుల భారం భరించలేని విధంగా మధ్యతరగతి ప్రజలను ఇబ్బంది పెట్టడమేనా? అని ప్రశ్నించారు. సిలిండర్ తెచ్చుకోవాలా?, సరుకులు కొనుక్కోవాలా? అనే మీమాంసలో పేదలు ఉండిపోవడం, రాష్ట్రాలు తమ స్వయంప్రతిపత్తిని కోల్పోవడమేనా? అని నిలదీశారు.

దేశ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

దేశ ప్రజల తరపున రాసిన బహిరంగ లేఖలో కొన్ని డిమాండ్లను కేటీఆర్ కేంద్ర మంత్రి ముందుంచారు. ఇంధన ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని, కేంద్ర ఎక్సైజ్ సుంకాలను గణనీయంగా తగ్గించి, రాష్ట్రాలకు ఇవ్వని సెస్‌లను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ క్రూడ్ ధరలకు అనుగుణంగా పారదర్శక ధరల విధానం అమలు చేయాలని కోరారు. ఇంధన పన్నులు, సెస్ వినియోగం, ఆదాయ వాటా వివరాలతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయాలని, ఆర్థిక కేంద్రీకరణ విధానాలను వీడి, నిజమైన సహకార ఫెడరలిజాన్ని పునరుద్ధరించాలని సూచించారు. దేశ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన సమయం కేంద్రప్రభుత్వానికి వచ్చిందని హితవు పలికారు. ఆకట్టుకునే నినాదాల వెనుక దాక్కోవడం మాని, అసలైన పని చేయాలని కేంద్రానికి సూచించారు.

సిరిసిల్లలో కేటీఆర్ బిజీబిజీ



గంభీరావుపేట మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అమ్మలతో ఆత్మీయంగా రామన్న

సిరిసిల్ల టౌన్/ సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 9: సిరిసిల్ల నియోజకవర్గంలో బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పర్యటించారు. రోజంతా బిజీబిజీగా గడిపారు. పలు ఆలయాల్లో పూజలు చేశారు. తొలుత జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన హనుమాన్ పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా హనుమాన్ స్వాములతో కలిసి కేటీఆర్ సహపంక్తి భోజనం (భిక్ష) చేశారు. సుమారు రెండు గంటల పాటు భజన, పూజాది కార్యక్రమాల్లో పాల్గొనడం పట్ల స్వాములు హర్షం వ్యక్తంచేశారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వెయ్యి మందికి పైగా హనుమాన్ భక్తుల భజనలతో తెలంగాణ భవన్ పరిసరాలు 'హనుమాన్, శ్రీరామ నామస్మరణ'తో మార్మోగాయి. హనుమాన్ స్వాములను కేటీఆర్ ఆప్యాయంగా పలకరించగా, ఆయనతో వారు ఫొటోలు తీసుకున్నారు. ఆ తర్వాత కోనరావుపేట మండలం మల్కపేటలోని సీతారామచంద్రస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకల్లో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు కేటీఆర్‌కు స్వామివారి కండువా కప్పి సత్కరించారు. అక్కడి నుంచి గంభీరావుపేట మండల కేంద్రంలోని పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణ మహోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేసి కట్నకానుకలు సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళ, కొమిరిశెట్టి లక్ష్మణ్, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో హనుమాన్ పూజ..
స్వాములతో కేటీఆర్ సహపంక్తి భోజనం

కేటీఆర్‌పై కేసు కొట్టివేత

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యే ముఠాగోపాల్‌పై దాఖలైన కేసును నాంపల్లి కోర్టు జడ్జి శ్రీదేవి బుధవారం కొట్టివేశారు. అనుమతి లేకుండా ప్రచారం నిర్వహించారంటూ ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో వీరిపై కేసు నమోదైంది.

హెచ్‌సీయూ భూముల్లో ఏర్పాటు చేసిన బోర్డు

హెచ్‌సీయూ భూముల్లో టీజీఐఐసీ బోర్డు

సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు
రాత్రికి రాత్రే బోర్డు పాతిన ప్రభుత్వం

కొండాపూర్, ఏప్రిల్ 9: కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములు తమవేనంటూ టీజీఐఐసీ బుధవారం రాత్రికిరాత్రే సూచిక బోర్డును ఏర్పాటుచేసింది. భూములపై వివాదం సుప్రీంకోర్టులో కొనసాగుతుండగా దొంగల్లా సూచికబోర్డులు ఏర్పాటుచేయడంపై వర్సిటీ అధ్యాపక, విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. సుప్రీంకోర్టు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కమిటీ కనీసం పరిశీలనకు రాకముందే భూములు తమవేనంటూ బోర్డులు ఏర్పాటుచేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే బుల్డోజర్లతో ఆ భూములోని అడవులను తొలగించి, వన్యప్రాణుల ఆవాసాన్ని తుడిచిపెట్టారని, భవిష్యత్తులో భూములను కూడా తమ లాభాల కోసం వ్యాపారులకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపిస్తున్నారు. యూనివర్సిటీకి చెందిన భూములపై పూర్తి హక్కులు తమవేనని, ఎట్టి పరిస్థితుల్లో ఇంచు భూమిని కూడా వదులుకునేది లేదని హెచ్చరించారు.

ఏబీవీపీ ఫొటో ఎగ్జిబిషన్

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో నివాసం ఉంటున్న వన్యప్రాణుల ఫొటోలతో ఏబీవీపీ విద్యార్థి సంఘం ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్, భూములపై ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఫొటోల్లో ఉన్నవి ఏఐ సాయంతో సృష్టించినవి కావని, ఇక్కడే అడవుల్లో ఉంటున్న వన్యప్రాణుల ఫొటోలని, వాటిని కూడా విద్యార్థులు స్వయంగా తీసిన వని ఏబీవీపీ నేతలు పేర్కొన్నారు.

హెచ్‌సీయూలో మరో జింక బలి

సిటీబ్యూరో/కొండాపూర్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : పాపం జింకలు.. ఒక్కొక్కటిగా కుక్కల చేతిలో పాశవికంగా మృత్యువాత పడుతున్నాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో రేవంత్ సర్కార్ బుల్డోజర్లు వందల ఎకరాల్లోని ఆకుపచ్చని అడవులను తుడిచిపెట్టడంతో... అక్కడ నివాసముంటున్న వన్యప్రాణులు ఎటు వెళ్లాలో తెలియక జనావాసాల్లోకి వస్తూ ప్రాణాలు కోల్పోతున్నాయి. మొన్నటి వరకు హెచ్‌సీయూలో రెండు జింకలు చనిపోగా.. తాజాగా మరో జింక బుధవారం సాయంత్రం విగత జీవిగా కనిపించింది. సెంట్రల్ వర్సిటీలోని చెక్ డ్యాం సమీపంలో ఆ జింక ఎటు వెళ్లాలో తెలియక తచ్చాడుతుంటే కుక్కల గుంపు దానిపై పడి విచక్షణారహితంగా కరిచాయి. జింక మృతదేహాన్ని వర్సిటీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలివి తక్కువ నిర్ణయం వల్లే వన్యప్రాణులు చనిపోతున్నాయంటూ విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. పచ్చని అడవులను తొలగించడమే కాకుండా అక్కడ జింకలు లేవు.. గుంట నక్కలే ఉన్నాయంటూ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని విమర్శించారు. యూనివర్సిటీలో జింకలు మృతి చెందుతున్నా.. తమకేమీ పట్టనట్టు వర్సిటీ భూములు తమకు చెందినవేనంటూ కాంగ్రెస్ ప్రభుత్వం బోర్డులు ఏర్పాటు చేయడం వారి కర్కశత్వానికి నిదర్శనం అని మండిపడుతున్నారు.

- క్యోటో ఒప్పందం ప్రకారం

ఉన్న భూమిలో పది శాతం విస్తీర్ణంలో నీడనిచ్చే చెట్లు ఉంటే కచ్చితంగా దానిని అడవిగా పరిగణించాలంటూ అంతర్జాతీయ ఒప్పందాలు చెబుతున్నాయి.



- గోదావర్మన్ తిరుముల్కపాడ్ వర్సెస్ కేంద్రం కేసులో సుప్రీం తీర్పు

అది ప్రైవేటు భూమిగాని... సర్కారు జాగా గాని... కనీసంగా పది హెక్టార్లకు మించిన విస్తీర్ణంలో చెట్లు విస్తరిస్తే అది అడవి అన్నది సాక్షాత్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు.

- తెలంగాణ సర్కారు జీవో 23 ప్రకారం

కనీసంగా రెండు హెక్టార్లకు మించిన స్థలంలో చెట్లు ఉంటే వాటిని ముట్టుకోవాలన్నా అటవీ శాఖ అనుమతి తప్పనిసరి. ఇది తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 23 సారాంశం.

- వన్యప్రాణి ఒప్పందం- 1972 ప్రకారం

ఇక... మన జాతీయ పక్షి నెమలిని కాదు; దాని గుడ్డును చిదిమినా కనీసంగా మూడేండ్ల పాటు కటకటాలు లెక్కించాల్సిందేనని వన్యప్రాణి చట్టాలు హెచ్చరిస్తున్నాయి.



రికార్డు ఆఫ్ ప్రొసీడింగ్స్‌లో 'కంచ గచ్చిబౌలి ఫారెస్టు, స్టేట్ ఆఫ్ తెలంగాణ' అని పేర్కొన్న సుప్రీంకోర్టు

పర్యావరణంపై కేసీఆర్ ప్రేమకు నిదర్శనం జీవో 23

సాధారణంగా దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారానికో, గుర్తుకు వచ్చినపుడో, ఇంకో సందర్భంలో మాత్రమే మొక్కలు నాటడంపై దృష్టి సారిస్తాయి. కానీ ఏటా మొక్కలు నాటడాన్ని ఓ యజ్ఞంలా చేపట్టేందుకు కేసీఆర్ ప్రభుత్వం హరిత హారం కార్యక్రమాన్ని నిర్వహించింది. పదేండ్లలో దాదాపు 230 కోట్లకు పైగా మొక్కలను నాటడంతో పచ్చదనం పెంపులో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించేందుకు కఠినమైన నిబంధనల్ని కూడా కేసీఆర్ ప్రభుత్వం రూపొందించింది. అందుకు జూలై 5, 2017న తీసుకువచ్చిన జీవో 23 నిదర్శనం. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ఇష్టానుసారంగా చెట్లను నరికివేయొద్దనే సదుద్దేశంతో అటవీ పరిరక్షణ చట్టం-1980, సుప్రీంకోర్టు ఉత్తర్వులు-1995, వాల్టా చట్టం-2002, 2004.. ఇలా అన్నింటినీ పరిగణనలోనికి తీసుకొని కేసీఆర్ ప్రభుత్వం నిబంధనల్ని రూపొందించింది. కానీ హెచ్‌సీయూ విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జీవో 23 నిబంధనల్ని తుంగలో తొక్కింది. పైగా జీవో ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాల్సిన రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖనే బాధ్యత మరిచి అది అడవి కాదని భ్రమింపజేసేందుకు నానా తంటాలు పడుతున్నది.

జీవో 23 చెబుతున్నది ఇది...

- రెండు హెక్టార్లలోపు విస్తీర్ణంలో చెట్లను నరికివేయాలంటే ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్వో) ఆ ప్రాంతాన్ని పరిశీలించి... ర్యాండమ్‌గా పది శాతం విస్తీర్ణంలోని చెట్ల (రకాలు) జాబితాను రూపొందించి, నిబంధనలకు అనుగుణంగా అనుమతి ఇవ్వాలి.
- రెండు హెక్టార్లకు మించి ఉన్నట్లయితే దానిని హైరిస్క్ క్యాటగిరీగా పరిగణిస్తారు. అందుకే ఇక్కడ ఎఫ్ఆర్వో ర్యాండమ్‌గా పది శాతం విస్తీర్ణంలో చెట్ల (రకాలు) జాబితాను రూపొందించిన తర్వాత డివిజన్ లేదా జిల్లా అటవీ శాఖ అధికారి సమగ్రంగా పరిశీలించాలి.
- యూకలిప్టస్, సుబాబుల్, క్యాజురినా వంటి మినహాయింపులు ఉన్న చెట్లను నరికివేయాలంటే అనుమతి అవసరంలేదు. కానీ దరఖాస్తుదారుడు కచ్చితంగా స్వీయ ధ్రువీకరణ (సెల్ఫ్ సర్టిఫికేషన్) ఇవ్వాలి. ఇతర చెట్లు ఉంటే మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి.
- రెండు హెక్టార్లకు మించిన విస్తీర్ణంలో చెట్ల నరికివేత చేపడితే వాల్టా-2002, 2004 ప్రకారం కచ్చితంగా దరఖాస్తుదారుడు నరికిన చెట్ల సంఖ్యకు రెట్టింపులో మొక్కలను నాటాలి. ఒకవేళ నాటకపోతే అధికారులు అందుకయ్యే మొత్తాన్ని వసూలు చేయాలి.

రేవంత్ సర్కారు చేసిందేమిటి...

- సెంట్రల్ యూనివర్సిటీలో రెండు హెక్టార్లు కాదు... 161.87 హెక్టార్లలో వందలాది బుల్డోజర్లతో అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేసింది. ఇందుకోసం ఎక్కడా నిబంధనలను అమలు చేయలేదు.
- అందులో 90 శాతం సుబాబుల్ చెట్లు ఉన్నాయంటూ అటవీ శాఖతో నివేదికను రూపొందించినట్టు తెలిసింది. ఇది వాస్తవం కాదని పరిశోధక విద్యార్థులు రూపొందించిన డాక్యుమెంటరీలు, నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వం చెప్తున్నదే నిజమైనా... జీవో 23 ప్రకారం టీజీఐఐసీ చెట్ల నరికివేతకు దరఖాస్తు చేసుకోవాలి. సుబాబుల్ చెట్లు అయినప్పటికీ ఒక్కో చెట్టుకు రూ.500 చొప్పున చెల్లించాలి. (కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జగిత్యాల ప్రాంతంలో ఒక చోట ఆరు వేల చెట్లను నరికివేయాల్సి వచ్చినపుడు కేసీఆర్ ప్రభుత్వం ఇలా సుమారు రూ.30 లక్షలను నీటిపారుదల శాఖ పరంగా చెల్లించడమే కాకుండా అన్ని నిబంధనల్ని అమలు చేసింది. ఇక్కడే కాదు ప్రతిచోటా చెట్ల నరికివేతలో నిబంధనల్ని అమలుచేసింది.)
- కానీ హెచ్‌సీయూ భూముల విషయంలో అసలు దరఖాస్తే చేయలేదు. దీంతో అటవీ శాఖ అధికారులు 400 ఎకరాల్లో పరిశీలన చేసి చెట్ల జాబితానే రూపొందించలేదు. అలాంటప్పుడు 90 శాతం సుబాబుల్ చెట్లు ఉన్నాయని నివేదిక ఎలా రూపొందిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.
- 400 ఎకరాల్లో అరుదైన జీవజాలం ఉందనేది వాస్తవం. ఈ నేపథ్యంలో వాటిలో కొన్నిరకాలు ట్రాన్స్‌లొకేషన్ చేయాల్సినవి ఉన్నాయని విద్యార్థులు చెప్తున్నారు. చాలామేరకు అరుదైనవి కావడంతో మళ్లీ వాటిని సృష్టించడమనేది సాధ్యం కాదంటున్నారు. దీంతో ప్రభుత్వమే నిబంధనల్ని ఉల్లంఘించి అసలు దరఖాస్తే చేయకుండా, అనుమతి తీసుకోకుండా వందల ఎకరాల్లో అడవిని ధ్వంసం చేసింది.
- ఈ క్రమంలో అటవీ పరిరక్షణ చట్టాలను ఉల్లంఘిస్తే మూడు నెలల నుంచి ఏడాది వరకు జైలు శిక్షతో పాటు రూ.10వేల వరకు జరిమానా విధించే అవకాశాలున్నట్టు అధికారులే చెప్తున్నారు. మరి.. ఇక్కడ ప్రభుత్వమే చట్టాలను ఉల్లంఘించి నందున శిక్ష ఎవరికి వేయాలి?

జంగల్.. దంగల్

మొదటిపేజీ తరువాయి...

ఇచ్చింది. రెండు హెక్టార్లకు మించిన స్థలంలో చెట్లు ఉంటే వాటిని ముట్టుకోవాలన్నా అటవీ శాఖ అనుమతి తప్పనిసరి అని తెలంగాణ ప్రభుత్వమే గతంలో ఉత్తర్వులు జారీచేసింది. ఉన్న భూమిలో పది శాతం విస్తీర్ణంలో నీడనిచ్చే చెట్లు ఉంటే కచ్చితంగా దానిని అడవిగా పరిగణించాలంటూ ఫ్రాన్స్‌లో 2019లో జరిగిన కాప్ సదస్సులో కుదిరిన అంతర్జాతీయ ఒప్పందం స్పష్టం చేస్తున్నది. ఇక.. మన జాతీయ పక్షి నెమలి గుడ్డును చిదిమినా కనీసంగా మూడేండ్ల పాటు కటకటాలు లెక్కించాల్సిందేనని వన్యప్రాణి చట్టాలు హెచ్చరిస్తున్నాయి. మరి.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఒకటి అరా కాదు! 400 ఎకరాల విస్తీర్ణంలో దట్టమైన చెట్లు, అరుదైన జీవజాలం ఉంటే.. రాష్ట్ర ప్రభుత్వమే దానిని అడవి కాదంటున్నది. చట్టాలను తుంగలో తొక్కి వందల ఎకరాల్లో అడవిని ధ్వంసం చేయడంతో పాటు యథేచ్ఛగా వన్యప్రాణి చట్టాలను ఉల్లంఘించి మూగజీవాల ఉసురు తీసుకుంది. పైపెచ్చు.. సుప్రీంకోర్టు నియమించిన సాధికార కమిటీ గురువారం హెచ్‌సీయూ భూమిల్ని పరిశీలించేందుకు వస్తున్న దరిమిలా 400 ఎకరాల్లో అసలు అడవేలేదనే నివేదికలు రూపొందించి తప్పుదోవ పట్టించేందుకు పన్నాగం పన్నుతున్నది. ఈ నేపథ్యంలో అసలు అడవి అంటే ఏంది? చట్టాలు ఏం చెప్తున్నాయి? న్యాయస్థానాలు ఏమి తేల్చాయి? అంతర్జాతీయ ఒప్పందాల సారాంశమేంది? అంతకుమించి వన్యప్రాణి చట్టాలు ఏమని ఘోషిస్తున్నాయి? రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడింది? అనే వాస్తవాలపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.

సుప్రీం ఉత్తర్వులూ బలాదూర్!

ఏది అటవీ ప్రాంతం? కంచ గచ్చిబౌలిలో విధ్వంసం తెరమీదికొచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్న ప్రశ్న ఇదే. రేవంత్ సర్కారు 400 ఎకరాల్లో ఉన్నది అడవి కాదంటున్నది. కానీ విద్యార్థులు, పర్యావరణ వేత్తలు, మేధావులు అందరూ అది అడవేనంటున్నారు. ఒక ప్రభుత్వం.. వ్యక్తులు ముఖ్యం కాదు. చట్టాలు, కోర్టు తీర్పులు ఏం చెప్తున్నాయనేది ప్రధానం. దేశ అత్యున్నత న్యాయస్థానం 1996లో ఇచ్చిన ఉత్తర్వులు అత్యంత కీలకం. టీఎన్ గోదావర్మన్ తిరుముల్కపాడ్ వర్సెస్ కేంద్రం కేసులో అడవికి స్పష్టమైన నిర్వచనం ఇచ్చింది. ఆ ఉత్తర్వుల మేరకు...

- ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన అటవీ ప్రాంతం అది ప్రభుత్వ స్థలంలోనైనా, ప్రైవేటు స్థలంలోనైనా యజమానితో సంబంధం లేకుండా దానిని అడవిగా నిర్ధారించవచ్చు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రికార్డుల్లో లేనప్పటికీ ఒక ప్రాంతం దట్టమైన చెట్లతో నిండి అడవిగా ఉన్నట్లయితే దాని యజమాని ప్రభుత్వమైనా, ప్రైవేటు వ్యక్తి అయినా, సంస్థలైనా దానిని అడవిగా (డిక్షనరీ మీనింగ్) పరిగణించాలి.
- సర్వోన్నత న్యాయస్థానం మరో సందర్భంగా ఇచ్చిన తీర్పులో అడవి విస్తృత పరిధిని వివరించింది. భూ యాజమాన్య వర్గీకరణతో సంబంధం లేకుండా కనీసం 10 హెక్టార్ల స్థలంలో చెట్లు విస్తరించిన భూభాగాన్ని అడవిగా పేర్కొన్నదని నిపుణులు చెప్తున్నారు.
- కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో జంతు, వృక్ష జాతులను మదింపు చేసి అరుణ్ వాసిరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి రాసిన 'యాన్ ఎకోలాజికల్ హెరిటేజ్ రిపోర్ట్' ప్రకారం ఆ భూముల్లో 233 పక్షి జాతులు, 13 ఉభయచరాలు, 32 సరీసృపాలు, మచ్చల జింక వంటి అనేక జంతువులున్నాయి. ప్రపంచంలోనే అత్యంత అరుదైన సాలీడు జాతులైన ముర్రిసియా హైదరాబాదెన్సిస్ ఉంది. ఈ సాలీడు హైదరాబాద్‌లో మాత్రమే కనిపించే అరుదైన జాతిగా వారు తమ నివేదికలో పేర్కొన్నారు.

ఈ ప్రాణులన్నిటికీ వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్-1972తోపాటు 400 ఎకరాలకు అటవీ పరిరక్షణ చట్టం-1980 వర్తిస్తుందని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

రేవంత్ సర్కారు చేసిందేమిటి?

400 ఎకరాల్లో ఏముంది? అసలు అది అడవా? కాదా? అక్కడ ఏమున్నాయి? అనే దానిపై ముందుగా కనీస మదింపు (అధ్యయనం) చేయించలేదు. అటవీ శాఖను అందులో భాగస్వామ్యం చేయకుండా ఏకపక్షంగా టీజీఐఐసీతోనే ముందుకుపోయింది. ఈ క్రమంలో అటవీ, వన్యప్రాణి, వాల్టా చట్టాలను బుల్డోజర్ల కింద నలిపివేసింది.

అంతర్జాతీయ ఒప్పందాల ప్రకారమైనా అది అడవే...

చివరకు అంతర్జాతీయ ఒప్పందాలను పరిశీలించినా.. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలు అటవీ ప్రాంతం కిందికే వస్తాయి. భారత ప్రభుత్వం కాన్ఫరెన్స్ ఆఫ్ పారిస్ (కాప్)-19లో 9-క్యోటో ప్రొటోకాల్‌పై సంతకం చేసింది. దీని ప్రకారం అటవీ ప్రాంతాన్ని గుర్తించడంలో కొన్ని ప్రమాణాలను పొందుపరిచారు. ముఖ్యంగా క్రౌన్ కవర్ పర్సంటేజీ (కెనోపీ)ని ప్రామాణికంగా తీసుకున్నారు. కెనోపీ అంటే నీడనిచ్చే చెట్లను ప్రామాణికంగా తీసుకోవాలని అర్థం. ఇందులో భాగంగా భారతదేశం కొన్ని ప్రమాణాలను నిర్ధారించుకుంది. దీనిప్రకారం కనీసం హెక్టారు విస్తీర్ణంలో రెండు మీటర్ల ఎత్తు ఉన్న నీడనిచ్చే చెట్లు పది శాతం వరకు ఉండాలి. ఆ భూమి యజమాని ప్రభుత్వమైనా, ప్రైవేటు అయినా, సంస్థ అయినా సరే! దానిని అడవిగా గుర్తించాలి. ఈ క్రమంలో కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో ఎన్ని భారీ చెట్లు ఉన్నాయో.. ఎంతటి అరుదైన జంతు, జీవజాలం ఉన్నదో తెలిపేందుకు అనేక నివేదికలు ఉన్నాయి. అయినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అది అడవి కాదని భ్రమింపజేసేందుకు నివేదికలు రూపొందిస్తున్నదనే విమర్శలు వస్తున్నాయి.

సుప్రీంకోర్టు రికార్డుల్లోనూ 'కంచ గచ్చిబౌలి అడవి'

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి మొదలు పర్యావరణవేత్తలు, మేధావులు, దేశంలోని చట్టాలు, అంతర్జాతీయ ఒప్పందాలు అది అడవేనని చెప్తున్నాయి. మూగజీవాలు సైతం మహాప్రభో.. ఇది అడవే అంటూ జీవి విడుస్తున్నాయి. చివరకు ఈ అంశాన్ని సుమోటోగా తీసుకున్న దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం రికార్డు ఆఫ్ ప్రొసీడింగ్స్‌లో 'కంచ గచ్చిబౌలి ఫారెస్టు, స్టేట్ ఆఫ్ తెలంగాణ' అని స్పష్టంగా పేర్కొన్నది. కానీ ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అది అడవి కాదని వాదిస్తున్నది. కంచ గచ్చిబౌలి భూముల విధ్వంసాన్ని సుమోటోగా స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం ఈ భూములను ఫారెస్టుగా పేర్కొన్నది. కాగా వివాదం దరిమిలా చోటుచేసుకున్న పరిణామాల్లో భాగంగా ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించి నివేదిక అందించాలని తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇచ్చిన రిజిస్ట్రార్ అందులో 'అటవీ ఆవాసం' అని పొందుపరచడం అది అడివేనని అనడానికి మరో సాక్ష్యం. నెమళ్లు, జింకలు, పక్షులకు ఆవాసమైన 100 ఎకరాలు ధ్వంసం చేసినట్టు నివేదికలో పేర్కొనడం గమనార్హం.

మరో ఉల్లంఘన..

రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా వివాదాస్పద భూములల్లోకి ప్రవేశించి అక్రమంగా సైన్ బోర్డులు పాతింది